


డాక్టరు దేవుళ్లు!

ఇంత పెద్ద పెద్ద శరీరాలు పెంచుకు తిరుగుతామేగానీ శరీరంలో ఏ చిన్న భాగానికి నొప్పి చేసినా ముసుగెట్టి తొంగుంటాం. ముప్పై రెండు పళ్ళల్లో ఏ పంటికి పోటొచ్చినా పిచ్చెక్కుతుంది. గిలగిలా తన్నుకుంటాం! చెట్టంత మనిషిని నిలువునా పడేస్తుంది. ఉండలా చుట్టి పారేస్తుంది. వేదాలు చదువుకున్నాను. నా జోలికి రావద్దంటే పన్నుపోటు ఆగదు. బిగ్గరగా పద్యాలు చదివి భయపెట్టినా పారిపోదు. ఇంగ్లీషులో కోప్పడినా డోంట్ కేరంటుంది. తెలుగులో పచ్చి బూతులు తిట్టినా లెక్కచేయదు. పన్నుపోటుకే ఇంత అల్లాడిపోతున్నావేమిటి మహాశయా అని ఎవరైనా అడిగితే ఈ వచ్చేపోటు కాలికో కడుపుకో వస్తే యింత కేర్ చేసేవాడ్ని కాదంటూ రాగాలు తీస్తాం. అక్కడికి కాలా కడుపూ తక్కువైనట్టు! ఆ మాటకొస్తే

మొత్తం శరీరంలో ఏ అవయవం యొక్క ఇంపార్టెన్సు ఆ అవయవానికి వుంటుంది. ఎక్కడ నొప్పి చేసినా నొప్పే.

నా కొచ్చిన తలపోటు నాకు వర్ణనాతీతం. ఆ బాధేమిటో అనుభవించే వాడ్ని నాకుబాగాతెలుసు. అమ్మోయ్, బాబోయ్, దేవుడోయ్ అంటూ క్షణానికోపాలికేక పెడుతుంటాను. నాపక్క వాడికి నా అరుపులు చిత్రంగానే వుంటాయి కొంతసేపు వింటాడు. ఆతర్వాత విసుక్కుంటాడు.నోరుమూసుకు పడుక్కోమని తిడతాడు. నా బాధయొక్క తీవ్రత ఏ స్థాయిలో వుందో తెలుసుకోలేక అతను తిడుతున్నాడని నాకు తెలుసు. బాధ అనేది అనుభవిస్తేనే తప్ప చెబితే అర్థమయ్యేదికాదు. పంచదార తియ్యగా వుంటుందంటామే గానీ ఆ తియ్యదనాన్ని వర్ణించమంటే ఎట్లా వర్ణించగలం? గుప్పెడు పంచదార అతని చేతుల్లో పోసి మింగమంటాం. అంతకంటే వేరే మార్గంలేదు. బాధ కూడా అంతే!

భూలోకంలో మనకొచ్చే నొప్పులూ బాధలూ జ్వరాలూ నయం చేయడానికి కొందరు డాక్టర్లు బోర్డులు కట్టుకుని వున్నారు. డాక్టర్లంతా ఒకే విధంగా వుంటారని అనుకోను. కొందరు నవ్వుతూ పలకరించి జబ్బులేమిటో కనుక్కుంటారు. కొందరు విసుక్కుంటూ మందులిస్తారు. కొందరు రోగినొక పురుగులా ఎంచుకుని ఎంతో చిరాకు పడుతూ వైద్యం చేస్తారు. విసుక్కునే డాక్టర్లూ, మూతి ముడుచుకుని మాట్లాడే డాక్టర్లూ, మనల్ని పురుగుల్లా చూసే డాక్టర్లంటే నాకు వళ్ళుమండిపోతుంది. చాచిపెట్టి కొడదామని వుంటుంది. మా ఊళ్ళో ఒకానొక డాక్టర్తో ఇట్లాంటి గొడవొకటి పెట్టుకున్నాను. అతను పేరుమోసిన డాక్టరే. రెండుచేతులా సంపాయిస్తున్నాడు. పశువుల డాక్టరు ఎట్లా వుండాలో నాకు తెలీదు. మనుషుల డాక్టరు మాత్రం మనిషిగా ప్రవర్తించాలని నా సొంత అభిప్రాయం. మా ఊరి డాక్టరు మనుషుల డాక్టరైనా అతని దగ్గర కొచ్చే పేషంట్లను పరమ పశువులుగా భావిస్తుంటాడు. కడుపునొప్పని చెబితే ఏం తిన్నావ్ చెత్త అని కోపంగా అడుగుతాడు. ముంతల దగ్గర కెడుతుంటావాని బేవర్సుగా ప్రశ్నిస్తాడు. ఆబోతులాగా వళ్ళు పెంచుకోకపోతే తోచదా అంటాడు. ఇట్లాగైతే తప్పకుండా చస్తావని దీవిస్తాడు. అతని తిట్టూ, దీవెనలూ భరించ శక్యంకావు.

అయినా అతగాడి హ స్తవాసిఉన్న డిమేండువల్ల ఎన్ని తిట్లుతిన్నా అతని దగ్గిరికే వెడుతుంటారు పేషెంట్లు. అల్లాంటి ఛాన్సు అనుకోకుండా నాకోసారి తగిలింది. సాహితీ సభలో ప్రసంగం పూ ర్తయిన తర్వాత చెస్టు పెయిన్ వచ్చింది. ఫ్రండ్సు నన్ను అతని దగ్గరికే తీసుకెళ్ళేరు. బల్లెక్కి పడుకో అన్నాడు. అట్లాగే చేసేను. మొహం నిండా విసుగు నింపుకుని నన్ను పరీక్షిస్తూ తెగ తాగుతావు కదూ అన్నాడు. అతని పరామర్శకి చాలా బాధపడ్డాను. మాటాడలేదు. తెగ తింటావు కదూ అన్నాడు రెండోసారి. ఇక తట్టుకోలేక పోతున్నాను. చెస్టు పెయిన్ ఎట్లా ఏడ్చినా అతగాడి హింసాత్మక కుశల ప్రశ్నలకి చిర్రెత్తు కొచ్చింది. బల్లమీద పడుకున్నవాడ్ని గబుక్కున లేచి కూచున్నాను. తెగతాగడం తెగతినడమే కాదు తెగ తిరుగుతాను కూడా! నువ్వు మాత్రం పేషెంటుని పలుకరించే పద్ధతి నేర్చుకోవాలి. నువ్వెంత గొప్ప డాక్టర్ వైనా గావచ్చు. నొప్పికే చచ్చినా చస్తానుగానీ, మంచి-మర్యాద లేకుండా మాట్లాడే నీ దగ్గిర నాకు వైద్యం అఖ్ఖరలేదు. మాటాడే పద్ధతి నా దగ్గర నేర్చుకొంటే వైద్యం నీ దగ్గర చేయించుకుంటాను. అంత వరకూ బై అంటూ చక్కా వచ్చేసేను.

డాక్టరనేవాడు అతని సొంత చిరాకు లెన్నివున్నా పేషెంట్ కి ఆత్మ బంధువులా కనిపించాలి. మందుకంటే మంచిమాటతో స్వస్థత చేకూర్చాలి. కొందరు డాక్టర్లను చూడగానే రోగం మాయమవుతుంది. అంత ప్రసన్నంగా వుంటాయి వాళ్ళ మొహాలు. వాళ్ళు భుజంమీద చెయ్యివేసి హవార్యూ అని అడగ్గానే సగం బాధ దిగిపోతుంది. ఈ జాతి డాక్టర్ల మీద నాకు భక్తి భావ మెక్కువ. ఎంత భయంకర వ్యాధి సోకినా నీకేం ఫరవాలేదనే అభయ హ స్తంలో బోలెడు స్వస్థత. తలనొప్పికే చస్తావని విసుక్కునే డాక్టరు ఆ వృ త్తికి అనర్హుడని చెబుతాను. కేవలం మందులతోనే వ్యాధి నయమయితే అలాంటి మందులు అందరు డాక్టర్లు ఇస్తారు. మందునిచ్చి వ్యాధిని నయం చేసినంత మాత్రాన అతను డాక్టరు కాలేడు. మనసిచ్చి మనకెంతో ధైర్యం కలిగించి పలకరింపుతోనే మనల్ని పరవశింపచేసే క్వాలిటీ డాక్టర్లు ఏ కొందరో వుంటారు. వాళ్ళందరూ నా దృష్టిలో దేవుడు డాక్టర్లు!